

# ఎండిన ఆశలు

## వేరుశనగ రైతుకు నష్టాల మూట

- వర్షాభావంతో దారుణంగా దెబ్బతిన్న పంట
- వారంలోగా వానొస్తే.. పశుగ్రాసం దక్కుతుంది


రాప్తాడు వద్ద ఎండిన వేరుశనగ

**రాప్తాడు, సెప్టెంబరు 28:** ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసిన రైతులను నష్టాల భయం వెంటాడుతోంది. వర్షాభావం కారణంగా పంట ఎండిపోయింది. పెట్టుబడి కూడా చేతికందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వారం రోజుల్లో పదును వర్షం కురవకపోతే పశుగ్రాసం కూడా దక్కదని అంటున్నారు. రాప్తాడు మండల వ్యాప్తంగా 33 వేల ఎకరాల సాగు భూమి ఉంది. జూన్, జూలైలో కురిసిన వర్షాలకు, బోరు బావుల కింద 4,350 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. వర్షాధారం కింద సాగు చేసిన వేరుశనగలో ఎదుగుదల లేదు. విత్తనం వేసినప్పటి నుంచి ఇప్పటి వరకూ సకాలంలో వర్షం కురవలేదు. పూత, పిందె సమయంలో కూడా పదును వర్షాలు కురవలేదు. దీంతో ఊడలు సరిగా దిగక చెట్టుకు మూడు లేదా నాలుగు కాయలు మాత్రమే కనిపిస్తున్నాయి. అవీ నాణ్యంగా లేవు. లొత్తగా మారాయి. నెల రోజుల నుంచి పదును వర్షం లేక ప్రస్తుతం పంట ఎండిపోతోంది. విత్తనాలు, ఎరువులు, మందులు, కూలీలు, ఇతర ఖర్చులు కలిపి ఇప్పటి వరకూ ఎకరానికి రూ.20 వేలు ఖర్చు చేశారు. అప్పు చేసి పెట్టుబడి పెట్టారు. తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పశుగ్రాసాన్ని సబ్సిడీతో ఇవ్వాలని కోరుతున్నారు.

### మొత్తం ఎండిపోయింది..



ఏడు ఎకరాల్లో వేరుశనగ సాగుకు రూ.1.50 లక్షలు ఖర్చయింది. సకాలంలో వర్షం కురవకపోవడంతో పూర్తిగా ఎండిపోయింది. కాయలు ఏమాత్రం లేవు. పంట సాగుకు ఖర్చయిన మొత్తం కూడా రాదు. వేరుశనగ సాగు చేసి నష్టపోయాను.
- కొండప్ప, రాప్తాడు

### రూ.లక్ష ఖర్చయింది..



జూన్‌లో కురిసిన వర్షానికి ఐదు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశాను. సేద్యం పనులు, వేరుశనగ విత్తనాలు, కూలీలు, ఎరువులు, మందులు, ఇతరత్రా ఖర్చులు రూ.లక్ష అయింది. చెట్టుకు మూడు నాలుగు కాయలు మాత్రమే ఉన్నాయి. కానీ ఔటన్ లేదు. - సాకే ముత్యాలన్న, రాప్తాడు

### పశు గ్రాసం కూడా దొరకదు.



మూడున్నర ఎకరాల్లో వర్షాధారం కింద వేరుశనగ పంటను సాగు చేశాను. విత్తనం వేసినప్పటి నుంచి సకాలంలో వర్షం కురవలేదు. పంట ఎదుగుదల లేదు. కాయలు చాలా తక్కువగా ఉన్నాయి. పంట సాగుకు రూ.60 వేలు ఖర్చయింది. పెట్టుబడి కూడా దక్కదు. ప్రభుత్వం ఆదుకోవాలి.
- శీల్ల మల్లికార్జున, రాప్తాడు

### ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి..



వేరుశనగ సాగుకు ఎకరానికి రూ.20 వేల ప్రకారం ఖర్చు చేశాము. వర్షాభావం కారణంగా పంట దిగుబడి ఏమాత్రం రాలేదు. పశుగ్రాసం కూడా దక్కే పరిస్థితి లేదు. ప్రభుత్వం రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకోవాలి
- శ్రీరాములు, రాప్తాడు

# శ్రమ ఆయుధమైతే గెలుపు బానిసవుతుంది

### హైకోర్టు జడ్జి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ శ్రీనివాసరెడ్డి

**అనంతపురం క్రైం, సెప్టెంబరు 28:** 'శ్రమ నీ ఆయుధమైతే గెలుపు నీ బానిస అవుతుంది' అని హైకోర్టు జడ్జి, అనంతపురం పోర్టు పోలియో జడ్జి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఈ-కోర్ట్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. హైకోర్టు జడ్జిలు జస్టిస్ శ్రీనివాసరెడ్డి, జస్టిస్ శ్యాంసుందర్, జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, విశ్రాంత న్యాయాధికారి హజరత్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాద వృత్తిలోను, న్యాయమూర్తిగానూ రాణించాలంటే పట్టుదలగా కృషి చేయాలని సూచించారు. అదృష్టం కంటే హార్డ్‌వర్క్‌ను నమ్ముకోవాలని, అది ఉన్నత శిఖరాలకు చేర్చుతుందని అన్నారు. తన విద్యాభ్యాసాన్ని హిందూపురం, అనంతపురం, కర్నూలులో కొనసాగించానని, అనంతపురాన్ని జన్మభూమిగా భావిస్తానని అన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురుప్రసాద్, రాజేంద్రప్రసాద్ న్యాయవాదుల సమస్యలను హైకోర్టు న్యాయమూర్తులకు వివరించారు. పోక్సో కోర్టు దూరంగా ఉండటం వలన కక్షిదారులు, న్యాయాధికారులు, న్యాయవాదులు ఇబ్బంది పడుతున్నారని, జిల్లా కోర్టుకు సమీపంలో స్థలాన్ని కేటాయించాలని కోరా రు. స్థలం, నిధుల కేటాయింపునకు సహకారం అందిస్తామని న్యాయమూర్తులు హామీ ఇచ్చారు. ఆరు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల నిర్మాణానికి రావాల్సిన నిధుల విషయంలోనూ సహకరిస్తామని అన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తులను ఘనంగా సన్మానించారు. అంతకుముందు న్యాయాధికారులతో హైకోర్టు న్యాయమూర్తులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ కోర్ట్ విధులలో భాగంగా పలు సూచనలు చేశారు. జస్టిస్ శ్రీనివాసరెడ్డిని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎస్పీ జగదీష్ మర్యాద పూర్వకంగా కలిశారు.


హైకోర్టు జడ్జిని సన్మానిస్తున్న బార్‌అసోసియేషన్ ప్రతినిధులు

# బిల్లు ఇస్తేనే అప్పగిస్తా..!

- రైతు సేవా కేంద్రం భవనంపై తకరారు
- రూ.20 వేల కోసం కాంట్రాక్టర్ మొండితనం
- సొంతానికి వాడుతున్న వైసీపీ నాయకుడు


నిర్మాణం పూర్తి అయిన రైతు సేవా కేంద్రం

**విడపనకల్లు, సెప్టెంబరు 28:** మండల పరిధిలోని పొలికి గ్రామంలో రైతు సేవా కేంద్రం భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టరు.. కేవలం రూ.20 వేల బిల్లు పెండింగ్ ఉన్న కారణంగా తాళం వేసుకుని.. సొంతానికి వాడుకుంటున్నాడు. బిల్లు బకాయి చెల్లిస్తేగానీ అధికారులకు భవనాన్ని అప్పగించేది లేదని వైసీపీ నాయకుడు, కాంట్రాక్టరు మాధవక్రిష్ణారెడ్డి భీష్మించుకున్నారు. వైసీపీ హయాంలో ఆర్బీకే నిర్మాణానికి రూ.21.80 లక్షలు మంజూరు చేశారు. వైసీపీ నాయకుడు మాధవక్రిష్ణారెడ్డి పనులు పూర్తి చేశాడు. బిల్లులో రూ.21.60 లక్షలు చెల్లించారు. ఇంకో రూ.20 వేలు ఇవ్వాల్సి ఉంది. దీంతో భవనాన్ని అప్పగించకుండా.. తన పొలంలో పండిన ధాన్యాన్ని నిల్వ చేసుకున్నాడు. సచివాలయ సర్వేయర్ అబ్రార్, అసిస్టెంట్ ఇంజనీర్ రూప నాగవేణి, వీఏఏ రమేష్ నాయక్ శనివారం వైసీపీ నాయకుడి వద్దకు వెళ్లి రైతు సేవా కేంద్రం తాళాలు ఇవ్వాలని కోరారు. బిల్లు చెల్లించి తీసుకోవాలని ఆయన అన్నారు. డీఈఈ, ఏఈఈ వచ్చిన తరువాత వారితో చర్చించి తాళాలు ఇస్తానని అన్నారు. దీంతో వారు వెనుదిరిగారు. ఇదే గ్రామంలో రూ.20 లక్షలతో హెల్త్ క్లినిక్ భవనాన్ని నిర్మించారు. దానికి ఇంకా రూ.3.75 లక్షలు రావాల్సి ఉన్నా.. కాంట్రాక్టరు అధికారులకు భవనాన్ని అప్పగించడం గమనార్హం.


రైతు సేవా కేంద్రానికి తాళం వేసిన వైసీపీ నాయకుడు

### సొంతానికి వాడుతున్నాడు..

పొలికి రైతు సేవా కేంద్రాన్ని గత ప్రభుత్వ హయాంలో నిర్మించారు. రూ.20 వేలు రాలేదని రూ.20 లక్షల విలువైన భవనాన్ని వైసీపీ నాయకుడు సొంతానికి వాడుతున్నాడు. అధికారులు స్పందించి భవనాన్ని సచివాలయ సిబ్బందికి అప్పగించాలి.
- హనుమంత రెడ్డి, గ్రామస్థుడు

### విత్తనాలు ఎక్కడ వేస్తారో..

రైతు సేవా కేంద్రం వైసీపీ నాయకుడి అధీనంలో ఉంది. సబ్సిడీ పప్పు శనగ విత్తనాలు వస్తే ఎక్కడ నిల్వ చేస్తారో తెలియదు. రైతు సేవా కేంద్రంలో లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి భవనాన్ని స్వాధీనం చేసుకోవాలి.
- రామాంజనేయులు, గ్రామస్థుడు

### స్వాధీనం చేసుకుంటాం..

ప్రభుత్వ భవన నిర్మాణం పూర్తి అవ్వగానే అధికారులకు అప్పగించాలి. కాంట్రాక్టర్లు తమ అధీనంలో పెట్టుకోకూడదు. బిల్లు వచ్చే వరకూ ఇవ్వను అంటే కుదరదు. బిల్లు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు మాత్రమే పెండింగ్‌లో ఉంది. అది కూడా త్వరలో ఇచ్చేస్తాం. రెండు రోజుల్లో డీఈఈతో కలిసి వెళ్లి రైతు సేవా కేంద్రాన్ని స్వాధీనం చేసుకుంటాము.
- వీరేష్, పీఆర్ ఏఈఈ, విడపనకల్లు

# పింఛన్ల పంపిణీకి సిద్ధంగా ఉండండి

### కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం టౌన్/క్లాక్ టవర్, సెప్టెంబరు 28:** అక్టోబరు ఒకటో తేదీన పింఛన్లను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి పింఛన్ల పంపిణీ, స్వచ్ఛతా హీ సేవ తదితర అంశాల గురించి డీఆర్‌డీఏ, డీపీఓ, ఆర్డీఓలు, ఎల్డీఎం, ఏపీఎంలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకే పింఛన్ల పంపిణీ మొదలు కావాలని సూచించారు. పింఛన్ల మొత్తాన్ని ముందుగానే డ్రా చేసుకోవాలని సూచించారు. గ్రామ, మండల స్థాయిలో తొలిరోజే పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగించాలని అన్నారు. మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారుల ప్రమేయం వందశాతం ఉండాలని అన్నారు. పారిశుధ్య కార్మికుల జాబితాను పంచాయతీ కార్యదర్శులు ముందుగానే తయారు చేసుకుని, వారికి అవసరమైన జాకెట్, క్యాప్, పరికరాలను అందించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా చెత్త, మురుగును తొలగించి, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, ప్లాంటేషన్, హెల్త్ క్యాంపులు కొనసాగించాలని ఆదేశించారు. సమీక్షలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్‌డీఏ పీడీ ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాకు రూ.125.37 కోట్లు

అక్టోబరు నెలలో జిల్లా వ్యాప్తంగా 2,85,933 మంది పింఛన్‌దారులకు రూ.125.37 కోట్లు మంజూరయ్యాయి. 1,41,477 మంది వృద్ధులకు రూ.56.59 కోట్లు, 66,478 మంది వితంతువులకు రూ.26.59 కోట్లు, 6,656 మంది చేనేతలకు రూ.2.66 కోట్లు, 356 మంది కల్లుగీత కార్మికులకు రూ.14.2 లక్షలు, 882 మంది మత్స్యకారులకు రూ.35.3 లక్షలు, 6,707 మంది ఒంటరి మహిళలకు రూ.2.68 కోట్లు, 3,498 మంది సఫాయి కర్మచారులకు రూ.1.39 కోట్లు, 205 మంది హిజ్రాలకు రూ.82 వేలు, 2,446 మంది హెచ్‌ఐవీ బాధితులకు రూ.97.8 లక్షలు, 3,112 మంది డప్పు కళాకారులకు రూ.1.24 కోట్లు, 180 మంది కళాకారులకు రూ.72 వేలు, 46,114 మంది దివ్యాంగులకు రూ.27.66 కోట్లు, కుష్టు బాధితులు 383 మందికి రూ.23 లక్షలు, 1,434 మంది మంచానికే పరిమితమైనవారికి రూ.2.15 కోట్లు, ప్రమాద బాధితులు 1081 మందికి రూ.1.62 కోట్లు, అభయహస్తం కింద 4,226 మందికి రూ.21 లక్షలు పంపిణీ చేస్తారు. ఇతర లబ్ధిదారులతో కలిపి మొత్తం 2,85,933 మందికి రూ.125.37 కోట్లు విడుదల చేశారు.

# సకాలంలో పరిశీలన పూర్తి చేస్తాం

### కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

**అనంతపురం టౌన్, సెప్టెంబరు 28:** జిల్లాలో అసైన్డ్, ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన సకాలంలో పూర్తి చేస్తామని సీసీఎల్ఏ రాష్ట్ర కమిషనర్ జయలక్ష్మికి కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సమీక్షలో జిల్లాలో పరిస్థితిని కమిషనర్ అడిగారు. జిల్లాలో 23,399 ఎకరాల భూములు ఉన్నాయని, అక్టోబరు 5లోగా అసైన్డ్, ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన పూర్తి చేసి, నివేదిక అందజేస్తామని అన్నారు.

జిల్లాలో ఫ్రీ హోల్డ్ అయి.. ల్యాండ్ రిజిస్ట్రేషన్ జరిగిన 99,679 ఎకరాల భూముల పునఃపరిశీలన అక్టోబరు ఒకటో తేదీకి పూర్తి చేస్తామని తెలిపారు.

### ఉద్యోగులకు అభినందన

ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద ఎత్తున రెడ్‌క్రాస్ సభ్యత్వం పొందడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసరెడ్డి, రెడ్‌క్రాస్ కార్యదర్శి మోహన్‌కృష్ణ, సభ్యులు శనివారం కలెక్టర్‌ను కలిశారు. జిల్లాలో నూతనంగా 770 మంది ప్రభుత్వ ఉద్యోగులు సభ్యత్వం పొందగా వచ్చిన రుసుము రూ.1,85,900ను కలెక్టరుకు అందజేశారు. ఉద్యోగులు పని ఒత్తిడితో విధులు నిర్వహిస్తున్నా.. సేవాభావంతో సభ్యత్వం తీసుకోవడం ఎంతో ఆనందం కలిగిస్తోందని అన్నారు.

# డిష్యుం.. డిష్యుం..!


పోలీసుల సమక్షంలోనే గొడవ పడుతున్న రెండు కుటుంబాలవారు

**కళ్యాణదుర్గం రూరల్, సెప్టెంబరు 28:** పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఇరవర్గాలవారు మాటామాట పెరిగి.. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దొడగట్ట గ్రామానికి చెందిన ధనుంజయ, అఖిల దంపతుల గొడవపడి.. పట్టణ పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదు చేసుకునేందుకు వెళ్లారు. అదే సమయంలో అఖిల తల్లిదండ్రులు, రెండు వైపులా బంధువులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఒకరినొకరు మాటలు అనుకూంటా ఆవేశంతో పిడిగుద్దులు గుద్దుకున్నారు. గొడవను ఆపేందుకు ఏఎస్‌ఐ రాజశేఖర్ ప్రయత్నం చేశారు. ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో సిబ్బంది వచ్చి అడ్డుకున్నారు. అప్పటికే ఈ గొడవ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

### వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం పెట్టాలి : విజిలెన్స్ ఎస్పీ

**అనంతపురం న్యూటౌన్:** ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య స్పష్టం చేశారు. శనివారం విజిలెన్స్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడుతూ నాణ్యమైన భోజనం అందించడంలేదన్న ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో సిబ్బంది టీంలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు చేపట్టేలా ప్రణాళికలను తయారు చేస్తున్నామని వివరించారు. నాణ్యత లోపించినట్లు రుజువైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.


# ఎండీయూ వాహనాల్లోనే సరుకులను చేర్చండి

### జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ

**అనంతపురం టౌన్, సెప్టెంబరు 28:** పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఒకటో తేదీ నుంచి ఎండీయూ వాహనాలద్వారానే బియ్యం, ఇతర సరకులను సరఫరా చేయించాలని జాయింట్ కలెక్టరు శివనారాయణ శర్మ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సరకుల పంపిణీపై పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ అధికారులతో శనివారం రాత్రి సమీక్ష నిర్వహించారు. డీలర్ల నుంచి రేషన్, ఇతర సరకులను పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. అందుకే ఇక నుంచి ఎండీయూ వాహనాలలో తీసుకువెళ్లి అందించాలని సూచించారు. కార్డుదారులకు పక్కాగా బియ్యం, ఇతర సరకులు పంపిణీ చేయాలని సూచించారు. తూకాలు తక్కువ ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఎస్‌డీటీలు తమ పరిధిలో పర్యవేక్షించాలని, ఎక్కడా ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎండీయూ ఆపరేటర్లు లేనిచోట కొత్తవారిని నియమించాలని సూచించారు. సమావేశంలో డీఎస్ఓ శోభారాణి, డీఎం రమేష్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, తూనికలు, కొలతల శాఖ అధికారులు, చౌక ధరల డిపోల అసోషియేషన్ నాయకులు పాల్గొన్నారు.

స్పందనల సమాహారం హృదయం. సంతోషం కలిగితే ఉప్పొంగుతుంది. బాధకు కుంగిపోతుంది. మారిన జీవన విధానం, ఆహారపు అలవాట్లను సమన్వయం చేసుకోలేని మనిషి తీరుతో అలసిపోతోంది. పెరుగుతున్న ఒత్తిడిని తాళలేక తల్లడిల్లిపోతోంది. ఇటీవలి కాలంలో వయసుతో సంబంధం లేకుండా యువకులు, పిల్లలు సైతం గుండె పోటుతో మృతి చెందుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం హృదయరక్ష ఇంజక్షన్లను అందుబాటులోకి తెచ్చి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉంచింది. ఆరోగ్యకరమైన జీవన శైలి, దురలవాట్లకు దూరంగా ఉండటమే హృద్రోగ సమస్యలకు పరిష్కారమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆదివారం వరల్డ్ హార్ట్ డే..

- నెలరోజుల కిందట జిల్లాకేంద్రంలో ఓ మీడియా సంస్థలో పనిచేస్తున్న శేఖర్(40) ఇంట్లో ఉండగా ఉదయమే ఛాతీలో నొప్పి అంటూ కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన డాక్టర్లు గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు.
- జిల్లాకేంద్రంలోని కళ్యాణదుర్గం రోడ్డు ద్వారకా విలాస్ సమీపంలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు మల్లిరెడ్డి(51) ఆరు నెలల కిందట ఉదయమే వాకింగ్‌కి వెళ్లి వచ్చి పేపర్ చదుతూ కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.




- ఏడు నెలల కిందట జిల్లా కేంద్రానికి చెందిన 22ఏళ్ల యువ కుడు ఛాతీలో నొప్పి అంటూ ఇంట్లో పడిపోయాడు. కుటుంబసభ్యులు చికిత్స కోసం సాయినగర్‌లో ఉండే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి, గుండెపోటుగా నిర్ధారించారు. వెంటనే స్టంట్స్ వేయడంతో బతికిపోయాడు. 22 ఏళ్ల యువకుడికి గుండెపోటు రావడం ఆశ్చర్యం కలిగించిందని అక్కడి డాక్టర్ అన్నారు.
- అనంతపురంలో నివాసం ఉండే ఓ ప్రభుత్వ టీచర్ నార్పల మండలంలో పనిచేస్తున్నాడు. తోటి టీచర్‌తో కలిసి ద్విచక్రవాహనంలో వెళుతుండగా దారి మధ్యలోనే కుప్పకూలిపోయాడు. ఏమైందని అతడి వెంట ఉన్న మరో టీచర్ అడగ్గా ఛాతీలో నొప్పి అంటూ అక్కడే ప్రాణాలు వదిలాడు.



# హృదయ వేదన

## నేడు వరల్డ్ హార్ట్ డే




సూపర్‌స్పెషాలిటీలో హృద్రోగ చికిత్స కేంద్రం

### పెరుగుతున్న గుండెపోటు మరణాలు
### అధికమవుతున్న హృద్రోగ సమస్యలు
### ఆహారం, అలవాట్లు, శారీరకశ్రమ లేనందుకే..
### హృదయరక్షణకు సూదిమందు
### జాగ్రత్తలే శ్రీరామ రక్ష అంటున్న వైద్యులు

**అనంతపురం టౌన్, సెప్టెంబరు 28:** మానవ శరీరంలో అతి ప్రధానమైన భాగం గుండె. మారుతున్న పరిస్థితులు, అభిరుచులు, అలవాట్లు, జీవన విధానం వల్ల ఆ హృదయం బరువెక్కుతోంది. ఆటుపోట్లను తట్టుకోలేక తల్లడిల్లి ఆగిపోతోంది. దీంతో మానవులు అకాల మరణం చెందుతున్నారు. దీంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. హృదయ వేదనకు మనమే కారణమని పలువురు హృద్రోగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మనుషులు గతంలో మాదిరిగా సమతుల ఆహారం తీసుకోవడంలేదు. శారీరక శ్రమ చేయడం లేదు. జంక్ ఫుడ్‌తోపాటు చిన్న వయసు నుంచే ధూమ, మద్య పానాలకు అలవాటు పడుతున్నారు. టెక్నాలజీ మాయలో పడి సరిగా నిద్రపోవడం లేదు. దీంతో మధుమేహం, బీపీలు, అధిక బరువు పెరిగి గుండె ఆరోగ్యానికి ముప్పుగా పరిణమిస్తున్నాయి. అందుకే ఇటీవలి కాలంలో వయసుతో సంబంధం లేకుండా గుండెపోటు మరణాలు పెరిగినట్లు వైద్యవర్గాలు చెబుతున్నాయి.

#### నాలుగు నెలల్లో 3137మంది బాధితులు

గడచిన నాలుగు నెలల్లోనే ఉమ్మడి జిల్లాలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా 3137మందికి గుండె సంబంధిత చికిత్స అందించినట్లు వైద్య శాఖ రికార్డులు చెబుతున్నాయి. ఇందుకు దాదాపు రూ14.70 కోట్లకు పైగా వ్యయం చేశారు. ఇందులో గుండెపోటుకు గురై శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారు 310మంది ఉండగా వీరికి రూ.2.53కోట్లు ఖర్చుపెట్టారు. మరో 2827మంది వివిధ రకాల హృద్రోగ బాధితులకు స్టంట్స్, ఇతరత్రా చికిత్సలు చేశారు. వీరికోసం రూ11.70 కోట్లకు పైగా వ్యయం చేసినట్లు చెబుతున్నారు. ఈ లెక్కలు సామాన్య ప్రజానీకానికి సైతం ఆందోళన కలిగిస్తున్నాయి.

#### యువత సైతం..

గతంలో గుండె పోటు అంటే ఏ 70 లేదా 80 ఏళ్ల వాళ్లకు వచ్చి ఉంటుందిలే అనుకునేవాళ్లు. కానీ ఇపుడు 20 ఏళ్ల దాటిన యువకులను సైతం గుండెపోటు భయపెడుతోంది. తీవ్ర ఒత్తిడికి గురికావడం, ధూమపానం, పొగాకు ఉత్పత్తులు వాడటం, అధిక బరువు, చెడు కొలెస్ట్రాల్, నిద్రలేమి, షుగర్, బీపీ కంట్రోల్‌లో పెట్టుకోకపోవడం వల్ల హృదయ ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

#### అందుబాటులోకి హృదయరక్ష

హృద్రోగ సమస్యలు పెరిగిపోవడం, ముఖ్యంగా యువత ప్రాణాలు కోల్పోతుండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈహార్ట్ అటాక్‌ల నియంత్రణకు పూనుకున్నాయి. ఇందులో భాగంగా అనేక రకాల వైద్య సేవలను అందుబాటులోకి తెస్తున్నాయి. ఇప్పటికే ఆరోగ్యశ్రీ ద్వారా హృద్రోగ బాధితులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. తాజాగా ప్రభుత్వాలు హృదయరక్ష అనే ప్రత్యేక ఇంజెక్షన్‌ను ప్రభుత్వ ఆస్పత్రులలో అందుబాటులోకి తీసుకు వచ్చారు. మార్కెట్‌లో ఒక్కో ఇంజెక్షన్ ఖరీదు రూ.42వేలు ఉంటుంది. అంత ఖరీదైన ఇంజక్షన్‌ను బాధితులకు సకాలంలో అందేలా రాష్ట్ర ప్రభుత్వం 24గంటలు వైద్యసేవలు అందించే అన్ని సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రులు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులలో అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఉమ్మడిజిల్లాలోని 19సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా సర్వజన ఆస్పత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో ఈహృదయరక్ష ఇంజెక్షన్‌ను అందుబాటులో ఉంచారు. గుండెపోటు వచ్చిన వ్యక్తిని సకాలంలో ఆస్పత్రికి తీసుకొస్తే ఈ ఇంజెక్షన్ వేస్తే బతకడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయని డాక్టర్లు అంటున్నారు.

#### జాగ్రత్తలు పాటిస్తేనే..



ఇటీవల హృద్రోగ బాధితులు పెరిగిపోయారు. స్మోకింగ్, అధిక బరువు, తీవ్ర ఒత్తిడికి, నిద్రలేమి, జంక్ ఫుడ్ తీసుకోవడం, నూనె పదార్థాలు అధికంగా వినియోగించడం వంటి ఆహారపు అలవాట్లు గుండెకు హాని కలిగిస్తున్నాయి. శారీరక శ్రమ లేకపోవడం వల్ల కూడా హార్ట్ అటాక్‌ల సంఖ్య పెరుగుతోంది. జాగ్రత్తలు పాటించడమే వీటికి విరుగుడు. శరీరబరువు అదుపులో ఉంచుకోవాలి. రోజూ 30నుంచి 40నిమిషాలు తగ్గకుండా నడకగాని వ్యాయామంగానీ చేయాలి. కనీసం రోజుకు 6గంటల నుంచి 8గంటలు నిద్రపోవాలి. ప్రధానంగా ఉప్పు, చక్కెర తక్కువగా తీసుకోవాలి.

- డాక్టర్ వంశీకృష్ణ, పావని ఆస్పత్రి, అనంతపురం

#### నిర్లక్ష్యం వద్దు



చాలామంది ఛాతీలో నొప్పిని నిర్లక్ష్యం చేయడం వల్లే ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. గుండెపోటు ఒక్కసారిగా రాదు. దాని లక్షణాలు నెలరోజులు ముందుగానే కనిపిస్తుంటాయి. బాగా చెమట పట్టడం, త్వరగా అలసిపోవడం, ఛాతీలో మంటగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. చాలామంది యువకులు మనకెందుకు గుండెపోటు వస్తుందని, ఏదో తిన్నందుకు గ్యాస్ట్రిక్ అని అనుకుంటూ నిర్లక్ష్యం చేస్తున్నారు. అలాంటివారే ఒక్కసారిగా గుండెపోటుతో వెంటనే ప్రాణాలు కోల్పోతున్నారు. అలాంటి లక్షణాలు కనిపించినపుడు వెంటనే డాక్టర్ వద్దకు వెళ్లి పరీక్షించుకోవాలి. మనం తినే ఆహారం, జీవన విధానంలో మార్పు చేసుకోవాలి. ప్రధానంగా దురలవాట్లకు దూరంగా ఉండాలి.

- డాక్టర్ ఫల్గుణ్, హృద్రోగ నిపుణులు, మార్క్ ఆస్పత్రి, అనంతపురం

#### రక్షణ బాధ్యత మీ చేతుల్లోనే..



ఒకప్పుడు 60ఏళ్లు దాటినోళ్లకు హార్ట్ అటాక్‌లు వచ్చేవి. ఇపుడు యువకులే హార్ట్ అటాక్‌ల బారిన పడి చనిపోతున్నారు. దీనికి మన అలవాట్లే కారణం. విచ్చలవిడి ఆహారపు అలవాట్లతో గుండె సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. చిన్నవయసువారు హార్ట్ అటాక్‌బారిన పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అందుకే ఎవరి గుండె రక్షణ బాధ్యత వారి చేతుల్లోనే ఉంటుంది. హృద్రోగ బాధితులు గతంలో ఎక్కడో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి లక్షలు ఖర్చుపెట్టుకొని చూపించుకోవాల్సి వచ్చేది. ఇపుడు సూపర్‌స్పెషాలిటీలో ప్రభుత్వం ఉచితంగా వైద్యసేవలు అందిస్తోంది.

- డాక్టర్ సుభాష్ చంద్రబోస్, గుండె వైద్యనిపుణులు, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

#### ప్రాణాలను రక్షించేందుకే హృదయరక్ష సూది



హార్ట్ అటాక్ బాధితుల ప్రాణాలు రక్షించడం కోసమే ప్రభుత్వం హృదయరక్ష ఇంజెక్షన్‌లను అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లాలో ప్రతి సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులతో పాటు జిల్లా ఆస్పత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో ఇవి అందుబాటులో ఉన్నాయి. నిర్దేశించిన ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో రెండు ఇంజెక్షన్‌లు అందుబాటులో ఉంచాము. ఇప్పటి వరకు ఈసూదులతో 107మంది ప్రాణాలు కాపాడం. సకాలంలో బాధితుడిని ఆస్పత్రికి తీసుకు వస్తేనే ఈసూది మందు ఫలితం ఇస్తుంది.

- డాక్టర్ రవికుమార్, డీసీహెచ్ఎస్

## ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి
### సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న రాంభూపాల్

**రాప్తాడు, సెప్టెంబరు 28:** వర్షాభావంతో ఖరీఫ్‌లో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. శనివారం రాప్తాడు సమీపంలో వర్షాభావంతో ఎండిపోయిన రైతు పామళ్ల కొండప్ప పొలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు కొండప్ప 7 ఎకరాల్లో వేరుశనగ సాగు చేసేందుకు రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడన్నారు. వర్షాలు సకాలంలో కురవక దిగుబడి తగ్గి రైతు ఆందోళన చెందుతున్నాడని వివరించారు. అన్ని గ్రామాల్లో రైతుల పరిస్థితి ఈ విధంగానే ఉందన్నారు. ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే గుర్తించి ఆర్థిక సహాయం అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల అధ్యక్షుడు పోతులయ్య, జిల్లా కమిటీ సభ్యుడు రామాంజినేయులు, కౌలు రైతు సంఘం అధ్యక్షుడు కదిరప్ప, రైతులు సుబ్బారెడ్డి, వెంకట్రాముడు, పోతులయ్య పాల్గొన్నారు.

## నేడు జిల్లాకు కేరళ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడి రాక

**అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 28:** కేరళ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు ఆచార్య వీకే రామచంద్రన్ ఆదివారం అనంతపురం విచ్చేయనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఆదివారం ఉదయం 10.30 గంటలకు జిల్లాకేంద్రంలోని అలేఖ్య ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించనున్న లెనిన్ శతవర్ధంతి సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తారన్నారు.

## డీఈఓను సస్పెండ్ చేసి విచారణ చేయాలి
### నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

**అనంతపురం విద్య, సెప్టెంబరు 28:** విద్యాశాఖలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయని, జిల్లా విద్యాశాఖాధికారిని సస్పెండ్ చేసి సమగ్ర విచారణ చేయాలని నవ్యాంధ్రటీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కరణం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, ప్రిన్సిపల్ సెక్రెటరీ కోన శశిధర్‌కు లేఖల ద్వారా ఈ మేరకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కొంతకాలంగా డీసీఈబీలో భారీగా నిధుల గోల్‌మాల్ జరుగుతోందన్నారు. సమగ్ర శిక్ష నుంచి రీ ప్యాప్టేషన్ అయిన టీచర్లకు పోస్టుల కేటాయింపులో నిబంధనలకు తూట్లు పొడిచారని అసహనం వ్యక్తం చేశారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానంలో సైతం అవకతవకలు జరిగినట్లు తెలుస్తోందన్నారు. అనంతపురం జిల్లా విద్యాశాఖలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేయాలని కోరారు.

## పత్తి కొనుగోలుకు త్వరలో రిజిస్ట్రేషన్లు

**అనంతపురం రూరల్, సెప్టెంబరు 28:** పత్తికొనుగోలుకు త్వరలో రిజిస్ట్రేషన్ ప్రారంభించడం జరుగుతుందని జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణచౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పొడుగుపింజ క్వింటా రూ.7,521, పొట్టి పింజకి రూ.7,121 ధరతో కొనుగోలు చేయాలంటూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావడం జరిగిందని పేర్కొన్నారు. రైతులు పత్తిని ఆరబెట్టి, శుభ్రపరచి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ప్లాస్టిక్ సంచులను వినియోగించకూడదని సూచించారు. పత్తికి కనీస మద్దతు ధర రావాలంటే పత్తి పింజ పొడవు 29.50ఎంఎం నుంచి 30.50ఎంఎం వరకు ఉండాలన్నారు. మైక్రోనియర్ వాల్యూ 3.5 నుంచి 4.3 వరకు ఉండాల్సి ఉంటుందన్నారు. తేమశాతం 8శాతం ఉంటే పూర్తిస్థాయి మద్దతు ధర లభిస్తుందని వివరించారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలతో సమీప రైతు సేవా కేంద్రాల్లో పేర్లను రైతులు రిజిష్టర్ చేయించుకోవాలన్నారు.

## విశ్వమానవ సమానత్వాన్ని కాంక్షించిన జాషువా
### ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

**అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 28:** తెలుగు సాహితీ పూతోటలో విరబూసిన సాహితీ సుగంధ పుష్పం, విశ్వమానవ సమానత్వాన్ని కాంక్షించిన మహనీయుడు గుర్రం జాషువా అని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. గుర్రం జాషువా 129వ జయంతిని పురస్కరించుకుని శనివారం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ముందు ఆయన విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకకు ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుర్రం జాషువా అనేక రచనలు చేశారని, ఖండకావ్యాలు రాశారని, వాటిలో గబ్బిలం, ఫిరదౌసి, క్రీస్తు చరిత్ర అతిముఖ్యమైనవన్నారు. అంటరానితనం, ఆధిపత్యం, వివక్ష, అసమానతలను నిరసిస్తూ సమానత్వ స్థాపనే లక్ష్యంగా సాహిత్య ఆయుధాన్ని చేపట్టిన గుర్రం జాషువాకు నివాళులర్పించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల కామర్స్ సెమినార్ హాల్‌లో ఆచార్య బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించిన జాషువా సాహితీ సదస్సులో జాషువా సాహిత్యపీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య, ఎస్కేయూ తెలుగుశాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర, ఎల్‌కేపీ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆశావాది శశాంకమౌళి మాట్లాడారు. జాతి పెడదోరణులను తన కవితా సాహిత్యంతో దునుమాడిన గొప్ప దార్శనికుడన్నారు. కార్యక్రమంలో ఆర్టీటీ తిప్పేస్వామి, పెద్దన్నగౌడ్, ఇంజనీర్ సుధాకర్‌బాబు, ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి, అంకె రామలింగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎంపీ అంబికా తదితరులు

## అవకాశాలను సద్వినియోగం చేసుకోండి
### ఫ్రెషర్స్‌డేలో వీసీ సుదర్శనరావు




**అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 28:** జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యనభ్యసించిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు అన్నారు. శనివారం కళాశాల ఆడిటోరియంలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఫ్రెషర్స్‌డేకు ముఖ్య అతిథిగా వీసీ సుదర్శనరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వీసీ మాట్లాడుతూ దేశ, విదేశాల్లో జేఎన్‌టీయూ పూర్వపు విద్యార్థులు పలురంగాల్లో ఉన్నత శిఖరాలను అందుకున్నారన్నారు. పాఠ్యాంశాల బోధన, ల్యాబ్‌ల సౌకర్యం అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో ఉందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధ, ప్రొఫెసర్లు ఆనందరావు, విజయకుమార్, నాగప్రసాద్‌నాయుడు, శేఖర్ రాజు, శివకుమార్ పాల్గొన్నారు.

### అనంతపద్మనాభ ఆలయంలో
## మెడికోల నృత్య ప్రదర్శన



నృత్యప్రదర్శన చేస్తున్న అనంత మెడికోలు

**అనంతపురం టౌన్/కల్చరల్, సెప్టెంబరు 28:** కేరళ అనంతపద్మనాభస్వామి ఆలయంలోని అతుక్కల్ అమ్మవారి సన్నిధిలో నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి ఆధ్వర్యంలో అనంతమెడికల్ కళాశాల విద్యార్థినులు శుక్రవారం భరతనాట్య ప్రదర్శన చేసి జిల్లాకు గుర్తింపు తెచ్చారు. శ్రద్ధ, దివ్యశ్రీ, కావ్య, హస్విత, మహాలక్ష్మీ, ఉషాశ్యసాయి, మోక్షిత, లాస్యప్రియ, ఇషిక్రప్రియ సుమారు నాలుగు గంటలపాటు నృత్య ప్రదర్శన చేసి ఆహూతులను కట్టిపడేశారు. అదేవిధంగా సంగీత విభావరిలో సంధ్యామూర్తి, నాగమ్మ, వనమాల, భారతి, శోభ, మంజుల, గీత కర్ణాటక శాస్త్రీయ సంగీతంతో ఆకట్టుకున్నారు.

## ఆంధ్ర-19 జట్టుకు వీరారెడ్డి ఎంపిక

**అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 28:** ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అండర్-19 జట్టుకు వీరారెడ్డి ఎంపికయ్యాడు. 2024-25వ సీజన్‌కు సంబంధించి అక్టోబరు 4వతేదీ నుంచి మొహాలీలో జరగనున్న వినూమన్కడ్ ట్రోఫీకి వీరారెడ్డి ఆంధ్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నాడు. అదేవిధంగా ఆంధ్ర-19 జట్టుకు బీసీసీఐ లెవెల్ ఏ కోచ్‌గా జిల్లాకు చెందిన గులామ్ ఖాదిర్‌బాషా కోచ్‌గా నియమితులయ్యారు.



వీరారెడ్డి



ఖాదిర్‌బాషా

## మైనాస్వామికి ఉత్తమ ప్రచార అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న మైనాస్వామి

**గోరంట్ల, సెప్టెంబరు 28:** మండలంలోని కరావులపల్లికి చెందిన చరిత్రకారుడు మైనాస్వామికి ఉత్తమ ప్రచార అవార్డు లభించింది. ఏపీ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో విజయవాడలో శుక్రవారం నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో ప్రముఖుల చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. ఆర్కిటెక్చర్ అండ్ హార్ట్ ఆఫ్ విజయనగర- 'లేపాక్షి' అనే ఆంగ్ల పుస్తకాన్ని ఆయన రచించారు. ఆయనకు జ్ఞాపికతోపాటు మెడల్, ప్రశంసాపత్రాన్ని ఇచ్చి సత్కరించారు. అవార్డు లభించడం పట్ల ఆయనను పలువురు అభినందించారు.

## రికార్డులు పక్కాగా ఉండాలి: ఎస్ఈ

**అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 28:** అభివృద్ధి పనులకు సంబంధించిన రికార్డులు పక్కాగా ఉండాలని ఎస్ఈ ఎహసాన్‌బాషా సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ కార్యాలయంలోని పలు విభాగాలను ఆయన శనివారం పరిశీలించారు. వివరాలను సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు వద్ద చేపట్టిన అభివృద్ధి పనులను, పంపింగ్ సరళిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ ఆంజినేయులుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

## పార్లమెంట్‌స్థాయి కమిటీ సభ్యుడిగా బీకే



**పెనుకొండ, సెప్టెంబరు 28:** పార్లమెంట్ స్థాయి ఉక్కుగనులు, బొగ్గుశాఖ కమిటీ సభ్యుడిగా హిందూపురం ఎంపీ బీకే పార్థసారధిని నియమించారు. తనను నియమించిన ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఐటీశాఖ మంత్రి నారాలోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బీకే పార్థసారధి తెలిపారు.

## వేరుశనగ పంట కోత ప్రయోగాలు

**అనంతపురంరూరల్, సెప్టెంబరు28:** మండలంలోని అక్కంపల్లిలో వ్యవసాయాధికారులు శనివారం పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. అనంతపురం డివిజన్ వ్యవసాయాధికారి రవి హాజరై పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు పుల్లమ్మ పొలంలోని 5/5మీటర్ల పరిధిలో జరిగిన ప్రయోగంలో 1.05కిలోల తూకం వచ్చినట్లు ఆయన తెలిపారు.

**గార్లదిన్నె :** ఈ సంవత్సరం ఖరీఫ్‌లో సాగుచేసిన వేరుశనగ పొలాల్లో శనివారం వ్యవసాయ అధికారులు పంటకోత ప్రయోగాలు చేపట్టారు. గార్లదిన్నెలోని మహిళా రైతు రాజేశ్వరి పొలంలో పంట కోత ప్రయోగాలు చేశారు. 5/5మీటర్ల పరిధిలో 1.92 కిలోల దిగుబడి వచ్చిందని వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు.

## జాయింట్-1 సబ్‌రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ

**అనంతపురం క్రైం,సెప్టెంబరు 28 :** రామ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జాయింట్-1 సబ్‌రిజిస్ట్రార్‌గా రమణరావు బాధ్యతలు చేపట్టారు. ధర్మవరంలో పనిచేస్తున్న ఆయనను ఇక్కడకు బదిలీ చేశారు. శనివారం బాధ్యతలు చేపట్టిన రమణరావుకు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతపురం నగరపాలికలో ఏసీపీగా శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టారు. తిరుపతి కార్పొరేషన్ నుంచి ఈయనను ఇక్కడకు బదిలీ చేశారు.

## ఎస్ఐ సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

**చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 28:** స్థానిక ఎస్ఐగా సత్యనారాయణ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు బదిలీపై పెనుకొండకు వెళ్లారు. ఆయన స్థానంలో పుట్టపర్తిలో వీఆర్‌లో ఉన్న సత్యనారాయణ ఎస్ఐగా బాధ్యతలు చేపటారు. పోలీసులు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతంపలికారు. అదేవిధంగా టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్ రెడ్డి, అంకే అమరేంద్ర తదితరులు ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిశారు.

## ట్రాన్స్‌కో ఏడీఈ, ఏఈలు...

**చెన్నేకొత్తపల్లి:** ట్రాన్స్‌కో ఏడీఈగా లక్ష్మీనారాయణ, ఏఈగా రామాంజినేయులు శనివారం ఎన్ఎస్‌గేటు లోని కార్యాలయాల్లో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏడీఈగా పనిచేస్తున్న నాగేంద్ర బదిలీపై గుంతకల్లు వెళ్లారు. ఆయన స్థానంలో అనంతపురంలో పనిచేస్తున్న లక్ష్మీనారాయణ ఇక్కడికి వచ్చారు. అదేవిధంగా ఇక్కడ పనిచేస్తున్న ఏఈ మదనమోహన్ బదిలీపై తాడిమర్రికి వెళ్లగా, అనంతపురం నగర డీ-3లో పనిచేస్తున్న రామాంజినేయులు ఇక్కడికి వచ్చారు.

## 5న మండల సర్వసభ్య సమావేశం

**అనంతపురంరూరల్, సెప్టెంబరు28:** మండల సర్వసభ్య సమావేశాన్ని అక్టోబరు 5వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పుల్లయ్య శనివారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30గంటలకు సమావేశం జరుగుతుందని, 15 అంశాలపై చర్చ ఉంటుందన్నారు. సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచు హాజరు కావాలన్నారు.

## టమోటా కిలో రూ.46

**అనంతపురంరూరల్, సెప్టెంబరు 28:** కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.46తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శనివారం 1350 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.36, కనిష్ఠ ధర రూ.30 పలికినట్లు తెలిపారు.

## తిరుమల లడ్డూ వ్యవహారంపై ఒకటిన నిరసన

**అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 28 :** తిరుమల లడ్డూను గత ప్రభుత్వం కల్తీ చేయడాన్ని నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబరు 1వ తేదీన జిల్లా కేంద్రంలో సప్తగిరి సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు. ఈమేరకు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రత్నమయ్య, రమణబాబు శనివారం సంయుక్త ప్రకటనలో వెల్లడించారు. హిందూ మతపెద్దలు, గురువులు, హిందూ సోదరులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## ఆర్డీఓ కార్యాలయంలోనూ ఇక గ్రీవెన్స్

**అనంతపురం టౌన్, సెప్టెంబరు28 :** ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని వచ్చే సోమవారంనుంచి అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలోను నిర్వహిస్తున్నట్టు జిల్లాకలెక్టరు వినోద్ కుమార్ శనివారం ఓప్రకటనలో తెలిపారు. అనంతపురం డివిజన్‌కు సంబంధించిన బాధితులు అక్కడకు వెళ్లితమ సమస్యలను వినతులరూపంలో ఇచ్చుకోవచ్చన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి గ్రీవెన్స్ స్వీకరణ యథాతథంగా కొనసాగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

**అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 28:** నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు ఆ సంస్థ కోఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివి 18 నుంచి 28 సంవత్సరాల వయస్సు కలిగిన యువత అర్హులన్నారు. బెంగుళూరులో 35రోజుల పాటు ఉచిత శిక్షణ, వసతి, భోజనం, సదుపాయాలు కల్పిస్తామన్నారు. అనంతరం నూరు శాతం నెలకు రూ.15వేలకు పైగా వేతనం ఉపాధి కల్పిస్తామని తెలిపారు. వివరాలకు సెల్ నం. 9000487423ను సంప్రదించాలని కోరారు.

## అంధ జంటకు ఎన్ఆర్ఐ ఆర్థికసాయం

**అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 28 :** నగరానికి చెందిన అంధ జంట గీత, రమేష్‌లకు ఎన్ఆర్ఐ ఆర్థికసాయం అందించారు. గీత, రమేష్ ఇద్దరూ పుట్టుకతోనే అంధులు. వీరిద్దరికీ సాయిట్రస్టు ఆధ్వర్యంలో గతేడాది వివాహం జరిపించారు. వీరిద్దరు గాయకులు... వారు సర్టిఫికేట్ కోర్సు పూర్తి చేసేందుకు సహకరించాలని సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్ అమెరికాలోని డల్లాస్‌లో స్థిరపడిన కిరణ్‌కుమార్‌కు సమాచారమందించారు. శనివారం అనంతపురానికి వచ్చిన ఆయన ఆ జంటకు మ్యూజిక్ కోర్సు ఫీజులకోసం నెలకు రూ.3వేలు చొప్పున మూడు నెలలకు రూ.9వేలు అందజేశారు. ప్రతిరోజు ట్రైనింగ్ సెంటర్‌కు వెళ్లివచ్చేందుకు ఆటో ఏర్పాటు చేశారు.

## బీఈడీ అకడమిక్ కన్సల్టెంట్ పోస్టుకు ఇంటర్వ్యూలు

**అనంతపురం సెంట్రల్:** ఎస్కేయూ బీఈడీ కళాశాలలో ఫిజికల్ సైన్స్ (మెథడాలజీ) సబ్జెక్టు బోధించేందుకు అకడమిక్ కన్సల్టెంట్ పోస్టుకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సోమశేఖర్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

## ఎస్వీఐటీలో ఘనంగా ఫ్రెషర్స్‌డే

**రాప్తాడు, సెప్టెంబరు 28:** మండలంలోని హంపాపురం సమీపాన గల శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సాయంత్రం ఫ్రెషర్స్‌డే ఆరంబ్-2024ను ఘనంగా నిర్వహించారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు ఆహ్వానం పలికారు. ఈ ఫ్రెషర్స్‌డేకి కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ, చైర్మన్ క్రిష్టారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పట్టుదలతో కృషి చేస్తే లక్ష్యం చేరుకోవచ్చన్నారు. ఎండీ వెన్నపూస రమాకాంతరెడ్డి, ప్రిన్సిపల్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకుంటే ఉద్యోగ అవకాశాలె ఎక్కువగా ఉంటాయన్నారు. ఫ్రెషర్స్ డే సందర్భంగా విద్యార్థి, విద్యార్థినిలు ఆట పాటలతో అలరించారు. కార్యక్రమంలో ఏఓ వెంకటశివారెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఎస్ఐ ఇంట్లో చోరీ

**అనంతపురం క్రైం,సెప్టెంబరు 28 :** ఓ రిటైర్డ్ ఎస్ఐ ఇంట్లో దొంగలు పడ్డారు. ఆ కుటుంబం షిర్డీకి వెళ్లిన సమయంలో అదను చూసిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. రిటైర్డ్ ఎస్ఐ వీరాంజేయులు గణేష్‌నగర్‌లో నివాసముంటున్నారు. కుటుంబంతో కలిసి ఆయన ఈనెల 25వతేదీ రాత్రి షిర్డీకి వెళ్లారు. శనివారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చారు. ఇంట్లో వస్తువులు చెల్లాచెదురుగా ఉండటంతో దొంగతనం జరిగిందని తెలుసుకున్నారు. బీరువాలో ఉండాల్సిన 12 గ్రాముల బంగారు గొలుసు, డైమండ్ రింగ్, డైమండ్ నెక్లెస్ దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెనుకపక్క బాత్‌రూమ్ కిటీకిని తొలగించి దొంగలు ఇంట్లోకి వెళ్లినట్లు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# విప్లవజ్యోతి భగత్‌సింగ్

● జయంతి సందర్భంగా పలువురి ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న విద్యార్థి నాయకులు

**అనంతపురం విద్య, సెప్టెంబరు 28 :** స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవజ్యోతి భగత్‌సింగ్ జయంతి వేడుకలను ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న ఆయన విగ్రహానికి శనివారం నాయకులు క్షీరాభిషేకం చేశారు. తర్వాత ఆయా సంఘాల నేతలు ఆనంద్‌కుమార్, హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి, సంతోష్ కుమార్ మాట్లాడుతూ... భగత్ సింగ్ అడుగుజాడల్లో నేటి యువత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఆయా సంఘాల నాయకులు మోహన్‌కృష్ణ, ధనుంజయ, వంశీ, చందు, మంజునాథ్, ఉమామహేష్, చందు,శ్రీనివాస్ రాజశేఖర్, సురేంద్ర, అభినవ్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం క్లాక్‌టవర్:** యువత భగత్‌సింగ్ అడుగుజాడల్లో సాగాలని ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవ స్థాపకుడు సుంకర రమేష్ పేర్కొన్నారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి యువత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ విష్ణుప్రియ, రమేష్, సొసైటీ సభ్యులు ప్రసిల్లా, జయ బాలాజీ రావు, మహేంద్ర, ధోని, తేజస్విని, భరత్‌సాయి, సంతోష్‌నాయక్, ఎర్రిస్వామి, అమృత తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం కల్చరల్ :** రాజీలేని స్వాతంత్ర్య పోరాట యోధుడు భగత్‌సింగ్ అని ఏఐడీఎస్ఓ మాజీ నాయకుడు రాఘవేంద్ర పేర్కొన్నారు. శనివారం భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉన్న భగత్‌సింగ్ విగ్రహానికి ఆల్ ఇండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్(ఏఐడిఎస్ఓ) పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ... భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో అందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఏఐడీఎస్ఓ నాయకుడు మహేష్‌బాబు, నగరాధ్యక్షుడు చరణ్‌రాజ్, కార్యదర్శి చరణ్‌తేజ్, నాయకులు మహమ్మద్, భవ్య, చంద్రిమ, బాబావలి, వంశి, శ్రావణి, కార్తీక్, రుద్రేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతతో కష్టపడితే భవిష్యత్తు ఉంటుంది

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు

**అనంతపురం అర్బన్, సెప్టెంబరు 28 :** బాధ్యతతో కష్టపడితే భవిష్యత్ ఉంటుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సూచించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావును పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర సభ్యులు పోతుల లక్ష్మీనరసింహులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువ కప్పి సన్మానించారు. పార్టీ అధిష్టానం నీకు మంచి అవకాశం ఇచ్చిందని, బాగా కష్టపడి పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సూచించినట్లు తెలిపారు.

## పీఎంఏవై ఇళ్లను త్వరగా పూర్తి చేయండి

● ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

**అనంతపురం అర్బన్, సెప్టెంబరు 28 :** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఎంపికైన లబ్ధిదారుల ఇళ్లను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆదేశించారు. స్థానిక అనంతపురం నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమంలో భాగంగా సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది మార్చిలోగా ఈ పథకం కింద ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలన్నారు. గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పూర్తిగా పట్టించుకోలేదని, పని చేయని ఏజెన్సీలకు వెంటనే నోటీసులు జారీ చేసి రికవరీ చేయాలన్నారు.

## జేఏసీ నేతగా ప్రకాష్‌రావు ఎంపిక హర్షణీయం

**అనంతపురం విద్య, సెప్టెంబరు 28 :** ఏపీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా ఆప్టా నాయకులు ప్రకాష్‌రావు ఎంపిక కావడం హర్షణీయమని ఆప్టా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి వెంకటరత్నం శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో ఓ ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న కాకి ప్రకాష్‌రావు...విజయవాడలో జరిగిన ఏపీ జేఏసీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఎంపిక కావడం సంతోషంగాఉందన్నారు.

## 'స్టీల్ ప్లాంటు ఘనతను కేంద్రం గుర్తించాలి'

**అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 28 :** విశాఖ స్టీలు ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం తన వైఖరి మార్చుకుని, ప్లాంటు ఘనతను గుర్తించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. జన విజ్ఞాన వేదిక(జేవీవీ) జిల్లా కార్యాలయంలో శనివారం కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్తంగా నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో నాగేంద్ర కుమార్ మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరణచేస్తే నాలుగువేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల్ని దశలవారీగా తొలగించాలని యాజమాన్యం ప్రకటిస్తున్నట్లు వార్తలొస్తున్నాయని తెలిపారు. కూటమిలో ప్రధాన పార్టీలైన టీడీపీ, జనసేనలు కేంద్రంపై ఒత్తిడితెచ్చి ప్లాంటు ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా చూడాలని కోరారు. ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి మాట్లాడుతూ... విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేంతవరకూ ఉద్యమం కొనసా గిస్తామన్నారు. అక్టోబరు 1, 2, 3వ తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. విద్యార్థి సంఘాలతో విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. అక్టోబరు 1వ తేదీన విద్యార్థి యువజన సంఘాలు, 2వ తేదీన కార్మిక సంఘాలు, 3వ తేదీన రైతు సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు.

## ప్రతిష్టకు భంగం కలిగించేలా అసత్య ప్రచారం

● డీఎస్పీకి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఫిర్యాదు

**అనంతపురం అర్బన్, సెప్టెంబరు 28 :** తన వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగే విధంగా జగన్ పత్రికలో కథనం రాసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు డీఎస్పీ శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు శనివారం డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దళిత ఎమ్మెల్యేనైన తనను సమాజంలో అగౌరవ పరిచే విధంగా జగన్ పత్రికలో రాతలు రాశారన్నారు. ఎవరో ధర్నా చేస్తుంటే.. ఎవరో అడ్డుపడితే తన అనుచరుల దైర్జన్యమంటూ రాశారన్నారు. ఈ ఘటనలో పాలుపంచుకున్న వారెవరూ తనకు తెలియదన్నారు. తనకు ఎలాంటి సంబంధం లేని, తన ప్రమేయం లేని ఘటనను తనకు ఆపాదిస్తూ వార్త రాశారన్నారు. అలాగే ఘటనలో పాలుపంచుకున్న వారెవరైనా తన పేరు వాడి ఉంటే వారిపైనా చర్యలు తీసుకోవాలని డీఎస్పీని కోరామన్నారు. ఈ ఘటనపై హోం మంత్రి, రాష్ట్ర ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి , కేసు నమోదు చేసే దాకా వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు.

## 'సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు అన్యాయం జరగకుండా చూడాలి'

**అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 28:** జిల్లాలో సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు అన్యాయం జరగకుండా స్థానిక అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర నాయకుడు శంకర్ కోరారు. ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శిని నియమించే ప్రక్రియ ద్వారా జిల్లాలో 1044 పంచాయతీలు ఉంటే.. ఇందులో గ్రేడ్-1 నుంచ గ్రేడ్-4 వరకు 605 మంది మాత్రమే ఉన్నారన్నారు. గ్రేడ్-5 కార్యదర్శులను సచివాలయాల నుంచి నియమిస్తే వారు 512 మంది ఉన్నారని అన్నారు. దీంతో పంచాయతీ సంఖ్యల కంటే కార్యదర్శుల సంఖ్య 73 మంది అదనంగా ఉన్నారన్నారు. ఈ 73 మందిని పంచాయతీలకు నియమిస్తే సీనియర్ కార్య దర్శులు గాలిలో ఉండాల్సి వస్తుందన్నారు. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా జిల్లా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవలని కోరాన్నారు.

## సూపర్‌స్పెషాలిటీలో ప్రత్యేక పర్యవేక్షణకు డాక్టర్ శివకుమార్ నియామకం

**అనంతపురం టౌన్, సెప్టెంబరు 28:** జిల్లాకు తలమానిక మైన సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు, ఆరోపణలు అధికమయ్యాయి. దీంతో వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. అందులో భాగంగా రాత్రిపూట ప్రత్యేక పర్యవేక్షణకు జిల్లా ఆస్పత్రిలో డిప్యూటీ ఆర్ఎంఓగా పనిచేస్తున్న డాక్టర్ శివకుమార్‌ను నియమిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

## పోలీసుల అదుపులో ఇద్దరు మైనర్లు

**అనంతపురం క్రైం,సెప్టెంబరు 28 :** ఇద్దరు మైనర్లను నాలుగో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని జేజే కోర్టులో హాజరు పరిచారని అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. వారి నుంచి ఏడు తులాల బంగారు కడ్డీ, నేరాలకు ఉపయోగించే రెండు ఇనుపరాడ్లు, టార్చి లైట్, పల్సర్ బైక్, ఒక ఐఫోన్, కెమెరా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి చెందిన ఈ ఇద్దరు ఆగస్టు నెల చివరి వారంలో స్థానిక తపోవనం సమీపంలోని ఓ ఇంటి తాళాలను పగలకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అలాగే చంద్రబాబు కొట్టాలలోని ఓ ఫొటో స్టుడియో షట్టర్‌ను ఇనుపరాడ్లతో పగలకొట్టి, అందులో నికాన్ కెమరాను, బ్యాటరీ ఇతర సామగ్రి దోచుకెళ్లారు. పామిడిలో ఓ షాప్‌లో సిగరెట్‌ప్యాకెట్లు ఇతర వస్తువులు దోచుకెళ్లారు. నగరంలోని రవి పెట్రోల్ బంక్ సమీపంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి, మద్యానికి బానిసైన వారు బైక్, సెల్‌ఫోన్లపై మోజుతో దొంగతనాలకు అలవాటుపడినట్లు పోలీసుల విచారణలో తేలింది.

## వెంకటేశ్వరాలయంలో సుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న టీసీ వరుణ్, జనసేన నాయకులు

**అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు28 :** చిత్తశుద్ధి లేని వారిని టీటీడీ బోర్డు చైర్మన్లుగా నియమించడంతోనే కల్తీ లడ్డూ ఘటనలతో అపవిత్రాలు జరుగుతున్నాయని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ మండిపడ్డారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ శ్రీవారి లడ్డూ కల్తీ జరిగిందన్న నేపథ్యంలో చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్ధతుగా టీసీ వరుణ్ ఆ పార్టీ కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవానీరవికుమార్, రాయలసీమ ప్రాంతీయ మహిళ కన్వీనర్ పెండ్యాల శ్రీలత, నగర అధ్యక్షుడు పొదిలి బాబురావుతో కలిసి శ్రీనివాస నగర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సుదర్శన హోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. పార్టీ ఆదేశాల మేరకు మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ, జిల్లా ప్రధానకార్యదర్శిలు పత్తి చంద్రశేఖర్, కుమ్మర నాగేంద్ర, నాయకులు కిరణ్‌కుమార్, ముప్పూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో వైసీపీ నాయకుల పూజలు

**అనంతపురం క్రైం,సెప్టెంబరు 28 :** నగరంలోని ఆర్ఎఫ్ రోడ్డులో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో వైఫల్యాలు కప్పిపుచ్చుకునేందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శిం చారు. డిక్లరేషన్ పేరుతో కుట్రలు చేశారని, జగన్ సీఎం కాక ముందు, అయ్యాక శ్రీవారిని దర్శించుకున్నారన్నారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

**శింగనమల:** వైసీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ వీరాంజనేయులు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని నాయనవారిపల్లిలో వెలసిన వెంకటేశ్వరాలయంలో పూజలు చేశారు. వైసీపీ నాయకులు బొమ్మన శ్రీరామిరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**కనగానపల్లి:** వైసీపీ నాయకులు శుక్రవారం ఆ లయాల్లో పూజలు చేశారు. తగరకుంట గ్రామంలో ఉన్న గులగాని వెంక టేశ్వరస్వామి ఆలయంలో జడ్పీటీసీ మారుతిప్రసాద్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి తదితరులు పూజలు చేయించారు.



వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న అనంతవెంకటరామిరెడ్డి

# తిరుమలకు వెళ్లడం ఇష్టంలేక దొంగ నాటకాలు

● మాజీ సీఎం జగన్‌పై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మండిపాటు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

**అనంతపురం అర్బన్, సెప్టెంబరు 28 :** తిరుమలకు వెళ్లడం ఇష్టం లేక నీ పర్యటనను రద్దు చేసుకొని దొంగ నాటకాలు ఆడటం సరికాదని మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మండిపడ్డారు. తిరుమలకు వెళ్లవద్దని నీపై ప్రభుత్వం ఆక్షలు విధించిందా..? పోలీసులు నీకే మైన నోటీసులు ఇచ్చారా? అని ప్రశ్నించారు. స్థానిక రోడ్లు, భవనాల అతిథి గృహంలో ఆయన శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరుమలలో డిక్లరేషన్ ఇవ్వకపోతే ఆలయ అధికారులు ప్రవేశాన్ని అడ్డుకుంటా రని, జగన్ తిరుమల పర్యటనను రద్దు చేసుకున్నారని అన్నారు. ఆయన వ్య క్తిగత సమస్యతో పర్యటన రద్దుచేసుకుని.... ప్రభుత్వం, పోలీసులు, దళి తులపై నెపాన్ని నెట్టాలని చూడటం దారుణమన్నారు. గత వైసీపీ హయాం లో 230 మంది దళితులను ఊచకోత కోయించావని, ఆరువేల మంది కి పైగా దళితులపై అక్రమ కేసులు పెట్టించారని జగన్‌పై మండిపడ్డారు. దళిత కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి, ఎస్సీఎస్టీ సబ్ ప్లాన్ నిధులును దుర్వియోగం చేశాడన్నారు. తిరుమల పర్యటనను రద్దు చేసుకున్న సందర్భంలో ఏ కా రణాలు చెప్పాలో తెలియక.... తననే తిరుమలకు వెళ్లనివ్వడం లేదంటే , ఇక దళితుల పరిస్థితి ఏమిటని సంబంధంలేని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. స్వార్థ రాజకీయం, స్వలాభం కోసం దళితులను పావుగా వాడుకోవాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. వైసీపీ హయాంలో జంతువుల కొవ్వు ద్వారా వచ్చే ఆయిల్‌తో తిరుమల లడ్డూను తయారు చేశా రని ప్రభుత్వం నిరూపిస్తే.. అది అవాస్తవమని జగన్ నిరూపించుకో వా లన్నారు. ఇకపోతే మానవత్వం, హిందూమతం గురించి ఆయనకు మాట్లాడే అర్హతలేదన్నారు. ఆయన వ్యక్తిగత, స్వలాభం కోసం హిందువులను అవమా నిస్తూ, దళితులను బలిచేస్తానంటే ఇక్కడెవరు ఉపేక్షించే పరిస్థితిలో లేరన్నా రు. లడ్డూను కల్తీ చేసినందుకు శ్రీవారి భక్తులకు క్షమాపణలు చెప్పడంతో పాటు ఇది దేశమేనా అన్నందుకు దేశ ప్రజలకు, రాష్ట్రంలోని దళితులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుమల తిరుపతి ఆలయంలో దళితుల ప్రవేశానికి ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. జగన్‌లాగా రాజకీయ స్వలాభం కోసం మతాలు, కులాలను వాడుకునే తత్వం సీఎం చంద్రబాబుకు లేదన్నారు. దళితుల అభివృద్ధి, సంక్షేమానికి సీఎం కృషి చేస్తున్నారన్నారు.

## దసరా ఉత్సవాలను విజయవంతం చేయండి

పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు

**అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 28 :** పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అక్టోబరు 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని పాతూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పిన్ని నాగరత్నం కోరారు. ఉత్సవాల బ్రోచర్లను శనివారం ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిన్ని నాగరత్నం మాట్లాడుతూ... ఉత్సవాల్లో ప్రత్యేక అలంకరణల కోసం ఆంధ్రప్రదేశ్‌తోపాటు సేలం నుంచి కళాకారులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు పార్శం సత్య నారాయణశెట్టి, ప్రధాన కార్యదర్శి చల్లా కృష్ణరంగయ్య, ధర్మకర్త నాగరాజు, కోశాధికారి సాయినాథ్‌గుప్త, ఉపాధ్యక్షుడు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం : ఆర్డీఓ

**గార్లదిన్నె, సెప్టెంబరు 28 :** ఆత్మహత్య చేసుకున్న రైతు సూర్యనారాయణ కుటుంబానికి న్యాయం చేస్తామని ఆర్డీఓ వసంతబాబు తెలిపారు. ఆర్డీఓ శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బండారు ఈరమ్మతో కలసి సూర్యనారాయణ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం ఆర్డీఓ విలేకరులతో మాట్లాడుతూ... మండల పరిధిలోని బూదేడు గ్రామం సర్వే నెంబరు 135-1లో కొంత భూమిని ప్రభుత్వం 1978 లో కుమ్మర నారాయణ కుటుంబానికి మంజూరు చేసిందన్నారు. అనంతరం వారసులైన ముగ్గురు అన్నదమ్ములు ఎకరా చొప్పున పంచుకున్నార న్నారు. వీరిలో ఇద్దరికి 2015లో పాసుపుస్తకాలు మంజూరయ్యాయని తెలిపారు. అయితే సూర్యనారాయణ తన భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించర నే ఉద్దేశంతో పురుగుల మందు తాగాడన్నారు. దీనిపై కుటుంబ సభ్యుల తో చర్చించామని, త్వరలో వారి పేరు మీద ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

## రైతుల సమస్యలపై దృష్టి పెట్టండి

**గార్లదిన్నె, సెప్టెంబరు 28 :** రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని రైతు సంఘం నాయకులు ఆర్డీఓ వసంతబాబును కోరారు. ఆత్మహత్య చేసుకున్న రైతు సూర్యనారాయణ కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ఆర్డీఓను రైతు సంఘం, సీపీఎం నాయకులు కలిశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి ఆర్డీఓతో మాట్లాడారు. రైతుల సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రైతుల భూ సమస్యలపై నిర్లక్ష్యం చేయకుండా పరిష్కా రానికి కృషి చేయాలని కోరారు.

## మాంటిస్సోరి విద్యార్థులకు బంగారు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

**అనంతపురం విద్య, సెప్టెంబరు 28 :** మాంటిస్సోరి స్కూల్ విద్యార్థులు తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు సాధించారు. ఆ విద్యార్థులను శనివారం కరస్పాండెంట్ సూర్య నారాయణరెడ్డి అభినందించారు. తాడిపత్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో 50, 45 కేజీల విభాగాల్లో తొమ్మిదో తరగతి విద్యార్థులు అర్షియ, హేమంత్, ఎనిమిదో తరగతి విద్యార్థి చరణ్ స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నారని కరస్పాండెంట్ తెలిపారు. విద్యార్థులు క్రీడలతోపాటు, చదువులోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి మాధవి, ప్రిన్సిపాల్ రమాదేవి, ఇతర టీచర్లు పాల్గొన్నారు.

## క్రీడలతో సెల్‌ఫోన్ అడిక్షన్ దూరం..!



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేసిన ఏజీఎం సుబ్బారెడ్డి

**అనంతపురం విద్య, సెప్టెంబరు 28 :** విద్యార్థులు క్రీడలపై దృష్టి సారిస్తే.... సెల్‌ఫోన్ అడిక్షన్ దూరం అవుతుం శ్రీచైతన్య పాఠశా లల ఏజీఎం సుబ్బా రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని కమ్మభవన్ సమీపంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం స్పోర్ట్స్ డేని ఘనంగా నిర్వహించారు. ఏజీఎం ముఖ్యఅతిథిగా హాజరై ఒలంపిక్ జ్యోతికి వెలిగించి, స్పోర్ట్స్ డేను ప్రారంభించారు. అనంతరం పతాకావిష్కరణ చేశారు. ఆయన మాట్లాడు తూ... మానసిక ఒత్తిడిని జయించాలన్నా...మానసిక ఉల్లాసం కలగాల న్నా...క్రీడలు ఎంతో ముఖ్యమని సూచించారు. అనంతరం పలు క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్, డీన్లు రిషిబాల, ముత్యాలన్న, సతీష్‌కుమార్, ఇతరులు రాధాకృష్ణ, రవిరాజ్, విజయ్ పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

**అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 28 :** ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి సెలెక్షన్స్‌లో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో సెపక్‌తక్రా, మోడరన్ పెంతలాన్, ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 300మంది బాలబాలికలు పాల్గొన్నారు. మొత్తం 60మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 1వ తేదీన గుంటూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని సెక్రటరీలు అనంతపురం సుగుణమ్మ, శ్రీసత్యసాయి మొరార్జీయాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా కక్షిదారుడు అయిన D.C.B.అనంతపురం బ్రాంచు వారు యం.విజయలక్ష్మి భర్త యం.ముత్యాలరెడ్డి ఋణసదుపాయము కొరకు దరఖాస్తు చేసుకున్నారు. వారు క్రింద కనపరచిన షెడ్యూలు దాఖలా ఆస్తిని బ్యాంకుకు తనఖా పెట్టుటకు సిద్ధమయినారు. వై.ఎల్లమ్మ భర్త వై.తిమ్మప్ప చనిపోయినారని తెలిసినది. కావున ఎవరికయిన క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన ఆక్షేపణలు వున్నఎడల ఈ ప్రకటన వెలువడిన 7రోజులలోగా తెలుపవలసినదిగా తెలియజేయమయినది. సదరి గడువు ద్వారా ఎలాంటి ఆక్షేపణలు రాని ఎడల నా కక్షిదారుడు అయిన **D.C.B.Bank** అనంతపురము బ్రాంచివారు ఋణ సదుపాయము కొరకు యమ్.విజయలక్ష్మిగారికి ఇచ్చుటకు తగు చర్యలు తీసుకొందురని తెలియజేయడమైనది.

**షెడ్యూలు**

Anantapur RD & SRD,Papampeta Village Polam Naryanapuram Panchayat and the Property Particulars are as follows

| Babu | Sy.No | AC | AC | H.S. | Plot No |
|---|---|---|---|---|---|
| Govt Dry | 27/1 | 3.00 paiki | 0.05 | 0.020 | 59 |

Bounded by:East: plot No.58, South:plot no.62,West:Plot No.60 property by kalavathi, North:Road, Measurement:East to West:83ft or 10.06 mts North to south:66ft or 20.12 mts 242 Sqr yards.

**P.V.Anupama, Advocate, Anantapur, Cell:9866243800**

# మార్చి లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోండి

● ప్రభుత్వం అన్ని సహాయ సహకారాలు అందిస్తుంది
● మన ఇల్లు - మన గౌరవంలో ఎమ్మెల్యే కాలవ

**రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 28:** గృహాలు మంజూరైన లబ్ధిదారులు 2025 మార్చి 31వ తేదీ నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఎమ్మెల్యే కాలవ సూచించారు. ఇందుకు ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. పట్టణంలోని బీటీపీ లేఅవుట్లో శనివారం హౌసింగ్ అధికారులు మన ఇల్లు- మన గౌరవం అనే పేరుతో లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం మన ఇల్లు - మన గౌరవం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రస్తుతం లబ్ధిదారులకు రూ. 4 లక్షల వరకు నిధులు కేటాయించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మిస్తామని అన్నారు. 2014-19 మధ్య కాలంలో రూ. 1.5 లక్షలను కేంద్ర ప్రభుత్వం, రూ. ఒక లక్షను రాష్ట్ర ప్రభుత్వం, ఎస్సీ, ఎస్టీలకు అదనంగా మరో రూ. 50 వేల నిధులను ఇచ్చి ఇళ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ. 1.50లక్షల కేంద్ర ప్రభుత్వ నిధులను, రూ. 30 వేల రాష్ట్ర ప్రభుత్వ నిధులను ఇచ్చి కేవలం రూ. 1.80 లక్షలతో సరిపెట్టారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల ఇళ్లు నిర్మిస్తామని ప్రగల్భాలు పలికి చివరికి రెండు లక్షల ఇళ్లు కూడా నిర్మించలేదన్నారు. జగనన్న కాలనీ లేఅవుట్ల పేరుతో వైసీపీ నాయకులు రైతుల వద్ద చౌకగా భూములు కొని ప్రభుత్వానికి అధిక ధరలకు విక్రయించి వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని మండిపడ్డారు. ఆ అవినీతిపై విచారణ జరిపిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ నాగరాజు, మున్సిపల్ వైస్‌చైర్మన్ పోరాళ్ళ శిల్ప, హౌసింగ్ డీఈ రంగస్వామి, గృహనిర్మాణశాఖ అధికారులు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

**మార్చిలోపు ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసుకోండి**

**గుంతకల్లు:** ఇప్పటికే నిర్మాణంలో ఉన్న హౌసింగ్ స్కీం ఇళ్లను లబ్ధిదారులు మార్చిలోపు పూర్తిచేసుకోవాలని, సమస్యలేవైనా ఉంటే పరిష్కరిస్తామని హౌసింగ్ పీడీ శైలజ సూచించారు. పట్టణంలోని దోనిముక్కల రోడ్డులోని ఇందిరమ్మ కాలనీలో హౌసింగ్ అధికారులు గృహనిర్మాణ లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పీడీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వంలో హౌసింగ్ స్కీంలో మంజూరైన ఇళ్లకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే శాంక్షన్ చేస్తామని, ఇళ్లు కట్టుకునే విషయంలో లబ్ధిదారులు ఏదైనా సమస్యలుంటే తమకు తెలియజేస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండారు ఆనంద్, బీఎన్ కృష్ణారెడ్డి, తలారి మస్తానప్ప, శివన్న, అంజి, రెవెన్యూ, మండలాభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

**తాడిపత్రి:** వచ్చే మార్చిలోపు పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ తెలిపారు. పట్టణ సమీపంలోని ఆర్టీటీ కాలనీలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ లబ్ధిదారులు పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులను మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సంధ్య, మున్సిపల్ డీఈ వెంకటసుబ్బయ్య, ట్రాన్స్‌కో ఏఈ విజయ్, మెప్మా అధికారులు, సచివాలయ, ట్రాన్స్‌కో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

**యాడికి:** మండలకేంద్రంలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో అధికారులు ఇళ్ల నిర్మాణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి రామాంజనేయులు, హౌసింగ్ ఏఈ ప్రశాంత్‌కుమార్, ఈఓపీఆర్డీ వెంకటేష్, ఏపీఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**బెళుగుప్ప:** మండలంలోని పలు గ్రామాల్లో గృహ నిర్మాణ లబ్ధిదారులకు హౌసింగ్ అధికారులు మన ఇల్లు..మన గౌరవం కార్యక్రమంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. హౌసింగ్ డీఈ శివారెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున , పలువురు అధికారులు పాల్గొన్నారు.

**యల్లనూరు:** మండలంలోని బుక్కాపురం గ్రామంలో హౌసింగ్ లబ్ధిదారులకు మన ఇల్లు.. మన గౌరవం కార్యక్రమంపై అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు, హౌసింగ్ ఏఈ సుప్రజ పాల్గొన్నారు.

**కణేకల్లు:** మండలంలోని యర్రగుంట గ్రామంలో హౌసింగ్ లబ్ధిదారులకు మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో తహసీల్దార్ పతేకుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ లక్ష్మీనారాయణ, మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ వన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పెద్దవడుగూరు:** మండలకేంద్రంలోని జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో లబ్ధిదారులతో అధికారులు మన ఇల్లు- మన గౌరవం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ఉషారాణి , ఎంపీపీ శ్రీదేవి, సర్పంచు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**డీ.హీరేహాళ్:** మండల కేంద్రంలోని సచివాలయంలో ఇళ్ల లబ్ధిదారులకు మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ రమేష్, హౌసింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**కళ్యాణదుర్గంరూరల్:** మండలంలోని కురుకుంట తోపు, ముదిగల్లు, నారాయణపురం లేఔట్లలో హౌసింగ్ లబ్ధిదారులకు మన ఇల్లు- మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. హౌసింగ్ డీఈ విజయ భాస్కర రావు, డీఎల్‌డీఓ శంకర్, ఏఈ లోకనాథ్ చౌదరి, ఈఓఆర్డీ హరికృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ సతీష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

**కుందుర్పి:** మండలంలోని తెనగల్లు గ్రామంలో హౌసింగ్ అధికారులు మన ఇల్లు- మన గౌరవం కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, హౌసింగ్ ఏఈ మారుతి , ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుధామణి, ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్, ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

**కూడేరు:** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మన ఇల్లు..మన గౌరవం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ చౌదరి, హౌసింగ్ డీఈ హనుమప్ప, ఏఈ శేఖర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తికి సన్మానం



**కళ్యాణదుర్గం రూరల్, సెప్టెంబరు 28:** హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డి శనివారం అనంతపురానికి రావడంతో కళ్యాణదుర్గం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి చక్రవర్తి, సీనియర్ న్యాయవాది దేవేంద్రప్ప కలిసి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కళ్యాణదుర్గానికి అదనంగా జూనియర్ సివిల్ కోర్టు, సీనియర్ సివిల్ కోర్టు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## బీసీ బాలుర హాస్టల్ తనిఖీ

**బొమ్మనహాళ్, సెప్టెంబరు 28:** మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని కళ్యాణదుర్గం అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారి గంగాధ్రి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అలాగే విద్యార్థులకు అందిస్తున్న తాగునీరు, భోజనం, ఇతర వసతుల గురించి వార్డెన్ కుళాయిస్వామిని ఆరా తీశారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు.

## విషద్రావకం కలిసిన నీటిని తాగి ఆవులు మృతి

**కుందుర్పి, సెప్టెంబరు 28:** మండలంలోని కరిగానపల్లి గ్రామంలో తిప్పేస్వామికి చెందిన రెండు ఆవులు శనివారం క్రిమిసంహారక మందు కలిసిన నీళ్లు తాగి మృతి చెందాయి. రోజు మాదిరిగానే ఆవులను పొలాల వద్దకు మేతకు తీసుకెళ్లాడని, కాగా ఓ పొలం వద్ద పంటకు పిచికారీ చేసేందుకు పురుగుల మందును నీటిలో కలిసి తొట్టిలో ఉంచారని, ఆవులు ఆ నీటిని తాగి మృతి చెందాయని బాధితుడు వాపోయారు. సుమారు రూ. 60 వేల దాకా నష్టం సంభవించిందని పేర్కొన్నారు.

## భూగర్భగనులశాఖ ఏడీగా ఓబుళరెడ్డి

**తాడిపత్రి, సెప్టెంబరు28:** పట్టణంలో భూగర్భగనులశాఖ ఏడీగా ఓబుళరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో పనిచేస్తున్న నాగయ్య బదిలీపై నరసరావుపేటకు వెళ్లారు. మార్యాపూర్వంలో పనిచేస్తున్న ఓబుళరెడ్డిని ఇక్కడ నియమించారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

**తాడిపత్రి, సెప్టెంబరు 28:** మండలంలోని కావేరిసముద్రం గ్రామ సమీపంలో పేకాట స్థావరంపై శనివారం పోలీసులు దాడులు చేశారు. ఇందులో పేకాటాడుతున్న 8మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.30వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ శివగంగాధరరెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు ఎస్ఐ కాటయ్య సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారన్నారు. అరెస్టు అయిన వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

## జిల్లాస్థాయి పోటీల్లో శైలజ ప్రతిభ



**రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 28:** మండలంలోని పల్లేపల్లి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని శైలజ స్కూల్ గేమ్స్ క్రీడాపోటీల్లో హైజంప్‌లో జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందినట్లు ఆ పాఠశాల హెచ్ఎం రమురాం, పీఈటీ సుధాకర్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీన డీ.హీరేహాళ్ మండలం సోమలాపురం హైస్కూల్‌లో నియోజకవర్గ స్థాయి హైజంప్ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. 27వ తేదీన అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి హైజంప్ పోటీల్లో ప్రతిభ చూపడంతో వారు ఆ విద్యార్థినిని అభినందించారు.

## రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

**యాడికి, సెప్టెంబరు 28:** మండలకేంద్రంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒవ్యక్తి తీవ్రగాయాలపాలయ్యాడు. కోనుప్పలపాడు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ పనినిమిత్తం బైక్‌లో యాడికికి వచ్చాడు. పనుల అనంతరం స్వగ్రామానికి బయలుదేరాడు. భైరవ కొండ సమీపాన అదుపుతప్పి వేగంగా డీకొనడంతో బైక్ అదుపు తప్పి కింద పడింది. ప్రమాదంలో లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆతన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

## పోక్సో కేసులో రిమాండ్‌కు తరలింపు

**పుట్లూరు, సెప్టెంబరు 28:** మండలంలోని ఓ గ్రామంలో మైనర్ బాలికపై అత్యాచారయత్నం కేసులో వీఆర్ఏ తిరుపాలును రిమాండ్‌కు తరలించినట్లుఎస్ఐ హేమాద్రి శనివారం తెలిపారు. బాలికపై అత్యాచారయత్నం చేయగా పోక్సో కేసు నమోదు చేశామన్నారు. ఈ మేరకు అనంతపురం రూరల్ డీఎస్పీ ఆధ్వర్యంలో అతడిని అరెస్టు చేసి కోర్టు హాజరుపరిచినట్లు తెలిపారు. అక్టోబరు 10 వరకు కోర్టు రిమాండ్ విధించిందని ఎస్ఐ తెలిపారు.

## అందుబాటులో వంద రకాల సేవలు

**కణేకల్లు, సెప్టెంబరు 28:** మండల ప్రజలకు వందరకాల సేవలు అందుబాటులో ఉన్నట్లు తహసీల్దార్ పతేకుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటనను విడుదల చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయభూమి విలువ ధరఖాస్తు, వ్యవసాయ ఆదాయ ధృవీకరణపత్రంతో పాటు మరో 47 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో మరో 11 రకాల సేవలు, పోలీస్‌శాఖ పరిధిలో రెండు రకాల సేవలతో పాటు స్త్రాంపులు, రిజిస్ట్రేషన్ పరిధిలో ఆరు రకాల సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అసిస్టెంట్ ఇంజనీర్, డిజిటల్ అసిస్టెంట్ ఆధ్వర్యంలో మిగతా సేవలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేడు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

**తాడిపత్రి, సెప్టెంబరు 28:** పట్టణంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో ఆదివారం కూడా విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చునని ట్రాన్స్‌కో అధికారులు శనివారం ప్రకటనలో తెలిపారు. ఆదివారం కూడా తమ సిబ్బంది అందుబాటులో ఉండి బిల్లులు కట్టించుకుంటారని తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

## 30 లోపు ఈకేవైసీ చేయించుకోండి

**రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 28:** నియోజకవర్గంలోని పంట సాగుచేసిన ప్రతి రైతు ఈ నెల 30లోగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏడీఏ లక్ష్మానాయక్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ పంట నమోదు చేసుకునే రైతులకు ప్రభుత్వం నుండి పథకాలు అందుతాయన్నారు.

## కమిటి సభ్యుడిగా కౌకుంట్ల రవి

**ఉరవకొండ, సెప్టెంబరు 28:** ఎస్సీఎస్టీ డివిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యుడిగా కౌకుంట్ల రవి నియమితులయ్యారు. గుంతకల్లులోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీఎస్సీ సమస్యల పరిష్కారానికి తనవంతుగా పోరాడతానని అన్నారు.



## ప్రాయశ్చిత దీక్షకు టీడీపీ, జనసేన మద్దతు

**గుత్తి, సెప్టెంబరు 28:** తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు పట్టణంలోని టీడీపీ, జనసేన నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక మహా హోమం, ఉపవాస దీక్ష చేపట్టారు. అనంతరం టీడీపీ గుత్తి ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త వాసగిరి మణికంఠ మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో తిరుమలలో తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడి అపవిత్రం చేశారన్నారు. దీంతో కోట్లాదిమంది స్వామి భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఇందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చిన్న వెంకటేశులు, ప్రధాన కార్యదర్శి బోయగడ్డ బ్రహ్మయ్య, నాయకులు పాటిల్ సురేష్, వెంకటపతి నాయుడు, ఓబులేసు, రామచంద్ర, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, బీజేపీ నాయకులు తిమ్మారెడ్డి, ఆకులశీన తదితరులు పాల్గొన్నారు.


దీక్షకు మద్దతు తెలుపుతున్న జనసేన, టీడీపీ నాయకులు

**గోవింద నామాల పఠనం**

**కూడేరు:** తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడడంపై మండలకేంద్రంలోని కోదండ రామాలయంలో శనివారం భక్తులు ప్రాయశ్చిత్తంగా 108 సార్లు గోవింద నామాలు చదివారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గోవిందనామాలు పఠించారు. తర్వాత స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

## వరద బాధితులకు విరాళం

**ఉరవకొండ, సెప్టెంబరు 28:** విజయవాడ వరద బాధితుల సహాయార్థం వజ్రకరూరు మండలంలోని పీసీ కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు విరాళాలను అందజేశారు. సేకరించిన విరాళాలు రూ.6,920లను డీడీ రూపంలో ముఖ్యమంత్రి సహాయనిధికి పంపనున్నట్లు పాఠశాల హెచ్ఎం గోవింద్ నాయక్ తెలిపారు. ఆ చెక్కును పాఠశాలలో తహసీల్దార్ నిషార్‌అహ్మద్, ఎంఈఓ ఎర్రిస్వామికి అందజేశామన్నారు.


పీసీ కొత్తకోటలో తహసీల్దార్‌కు చెక్కును అందజేస్తున్న హెచ్ఎం, విద్యార్థులు

**సీఎం సహాయనిధికి విరాళం అందజేత**

**రాయదుర్గంరూరల్:** విజయవాడ వరదబాధితుల సహాయార్థం పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ కెడెట్లు , ఎన్‌సీసీ క్యాడెట్లు, విద్యార్థులు కొద్దిరోజులుగా విరాళాలు సేకరించారు. సేకరించిన రూ. 43,722 మొత్తాన్ని శనివారం డీడీ రూపంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణిసుస్మిత అధికారిక ఉత్తరం ద్వారా కళాశాల ప్రిన్సిపాల్ రమురామమూర్తి అందించారు.

## ఉపాధి పనుల పరిశీలన


చీనీతోటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ తదితరులు

**గుత్తిరూరల్, సెప్టెంబరు 28 :** మండలంలోని బసినేపల్లి గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ విజయలక్ష్మి శనివారం పరిశీలించారు. చీనీ, మల్బరీతోటల పెంపకంతో పాటు ఫారం పాండ్లను, షెడ్ల నిర్మాణాన్ని ఆమె పరిశీలించారు. ఉపాధి పథకంలో చేపట్టే పనులను రైతులకు ఉపయోగపడేవిధంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ విజయకుమార్, ఏపీఓ మధుసూదన్‌రెడ్డి, జేఈ ఈశ్వరరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు జయచెన్నారెడ్డి, రత్నలు, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చోరీ జరిగిన ఇళ్ల పరిశీలన

**తాడిపత్రి, సెప్టెంబరు 28:** ఈనెల 24న మండలంలోని ఇగుడూరు గ్రామంలో చోరీ జరిగిన రెండిళ్లను శనివారం డీఎస్పీ రామకృష్ణుడు పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులు నారాయణస్వామిచౌదరి, సూర్యనారాయణచౌదరిల ఇంటిలోకి వెళ్లి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఇంటిచుట్టుపక్కల ప్రాంతాలను డీఎస్పీ పరిశీలించారు. సీఐ సిబ్బంది ఉన్నారు.

## ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని పూజలు

**తాడిపత్రి, సెప్టెంబరు 28:** కొద్దిరోజులుగా చికున్ గున్యా జ్వరంతో బాధపడుతున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకుని ప్రజల్లోకి రావాలని కోరుతూ పట్టణంలోని టీడీపీ కౌన్సిలర్లు, నాయకులు శనివారం పలు ఆలయాలు, మసీదు, చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బుగ్గనుమలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సిద్ధిబాషా దర్గా, సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు జరిపారు. వైస్‌చైర్మన్లు సరస్వతి, అబ్దుల్ రహీం , కౌన్సిలర్లు విజయ్‌కుమార్, మల్లికార్జున, రంగనాథరెడ్డి, రేష్మాపర్వీన్, జింకా లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకిసేవ

**ఉరవకొండ, సెప్టెంబరు 28:** మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీ సేవ ను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తెలుగు ఆలయంలో మూలమూర్తికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఉత్సవవిగ్రహాన్ని పట్టు వస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళ తాళాలతో ఆలయం చుట్టూ ఊరేగించారు.

# శ్రీవారి ప్రసాదంపై అసత్య ప్రచారం తగదు: వైసీపీ

**రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 28:** పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వైసీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయ కర్త మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు రాజకీయ దురుద్దేశతో వైసీపీ ప్రభుత్వంలో తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడారని అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. తిరుమల పవిత్రత మంటగలిసేలా ఆయన వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆ పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మండల కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

**గుంతకల్లుటౌన్:** పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వైసీపీ నాయకులు స్వామివారికి 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడిన మాటలు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఎంతో పవిత్రంగా భావించే తిరుపతి వెంకటేశ్వరస్వామిని, అపవిత్ర పాలు చేసే విధంగా ఉన్నాయన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడడాన్ని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎన్ భవాని, వైస్‌చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, షైమూన్, వైసీపీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, నాయకులు పాల్గొన్నారు.

**గుత్తి:** వైసీపీ హయాంలో తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వాడినట్లు అసత్య ప్రచారం చేయడం తగదని ఆపార్టీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని శివాలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. జగన్ సీఎంగా ఉన్నప్పుడు తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించారని సీఎం చంద్రబాబు ఆరోపణలు చేయడం తగదన్నారు. ఇందులో ఎంతమాత్రమూ వాస్తవం లేదన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ హుసేన్ పీరా, నాయకులు ప్రవీణ్ కుమార్‌యాదవ్, మధుసూదన్‌రెడ్డి, గురుప్రసాద్‌యాదవ్, రాజ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రాయదుర్గంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న వైసీపీ నేతలు

**తాడిపత్రి:** పట్టణంలోని వైసీపీ నాయకులు శనివారం స్థానిక చింతల వెంకటరమణస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌పై వస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. టీడీపీ నేతలు కుంది బుద్ధిసాధించాలని తిరుమల వెంకటరమణస్వామిని కోరామని తెలిపారు. కౌన్సిలర్ అంబికా, వైసీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి సునీల్ సర్వశత, నాయకులు పేరం అమీనాళానందరెడ్డి, రాజు, కేశవరెడ్డి, చవ్వా రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేమకల్లు అంజన్నకు ప్రత్యేక పూజలు

**బొమ్మనహాళ్, సెప్టెంబరు 28:** మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేకువజామునే ప్రధాన అర్చకుడు అనిల్ మార్‌చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు స్వామివారికి సుప్రభాతసేవ చేశారు. అనంతరం పంచామృతాభిషేకం, నిర్మల్య విసర్జన, విష్ణుపారాయణం, వెండి కవచ అలంకరణ, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం నైవేద్యం సమర్పించి మహామంగళహారతి ఇచ్చారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందారు.


వెండికవచ అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

**చెన్నకేశవస్వామి ఆలయంలో..**

**పెద్దవడుగూరు:** ఏకాదశిని పురస్కరించుకుని మండలకేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం అర్చకులు స్వామిమూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. అలాగే భగవద్గీత పఠనం, విష్ణుసహస్ర పారాయణం చేశారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

**రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో..**

**బొమ్మనహాళ్:** మండలంలోని ఉంతకల్లు రుక్మిణీ పాండు రంగస్వామి ఆలయంలో ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. వేకువజామునే అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, పుష్పాలంకరణ చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మహామంగళహారతి ఇచ్చారు. స్థానికులతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

## ఘనంగా గుర్రం జాషువా జయంతి

**తాడిపత్రి, సెప్టెంబరు 28:** సమానత్వం కోసం సాహితీ పోరాటం చేసిన యోధుడు గుర్రం జాషువా 129వ జయంతి వేడుకలను పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానంగా ఉండాలనే సమానత్వం కోసం తన కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని పోరాడిన మహోన్నత వ్యక్తి గుర్రం జాషువా అని కొనియాడారు.



యాడికిలో భగతసింగ్, జాషువా చిత్రపటాల వద్ద నివాళులు అర్పిస్తున్న సభ్యులు

**ఉరవకొండ:** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గుర్రం జాషువా జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ మస్తానప్ప, అధ్యాపకులు పాల్గొన్నారు.

**భగత్‌సింగ్‌కు ఘన నివాళి ..**

**గుంతకల్లుటౌన్ :** స్వాతంత్ర్య పోరాట యోధుడు భగత్‌సింగ్ జయంతి పట్టణంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కేకును కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకీ, ప్రసాద్, విక్రమ్, రాముగౌడ్, చిన్న, కన్నయ్య, మంజు, సుంకన్న, చందు, సాయి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏఐఎస్ఎఫ్ నాయకులు స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్, వెంకటేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

**తాడిపత్రి:** పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లోని సచివాలయంలో భగత్‌సింగ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**రాయదుర్గంరూరల్:** పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో భగత్‌సింగ్ జయంతిని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కొట్రేష్, విద్యార్థి సంఘం జిల్లా మాజీ నాయకుడు ఆవుల మనోహర్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

**బెళుగుప్ప:** భగత్‌సింగ్, గుర్రం జాషువా వీరి జయంతి వేడుకలను సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు వారు మండల వ్యాప్తంగా ఉన్న విలువల బడుల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు, వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**యాడికి:** మండలంలోని రాయలచెరువులో గల లయన్స్ క్లబ్ కార్యాలయంలో భగత్‌సింగ్, గుర్రం జాషువా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సూర్యనారాయణ వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. లయన్స్‌క్లబ్ సభ్యులు కులశేఖర్‌నాయుడు, ఇస్మాయిల్, రామకృష్ణ, రవికుమార్‌రెడ్డి, సత్యరంగయ్య, శేషానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు. న్యూవికాస్ హైస్కూల్‌లో భగత్‌సింగ్ జయంతి వేడుకలను నిర్వహించారు.

## రేబిస్ నివారణకు సహకరించండి

**రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 28:** రేబిస్‌వ్యాధిని నివారించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పశువైద్యుడు సూర్యనారాయణరెడ్డి కోరారు. ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పశువైద్య కేంద్రంలో శనివారం ఆయన మాట్లాడారు. రేబిస్‌తో కలిగే నష్టాలను వివరించారు. ఆ వ్యాధి నివారించాలంటే ప్రతి సంవత్సరం కుక్కలు, పిల్లులకు రేబిస్ నివారణ టీకాలు వేయించాలన్నారు. ఎవర్నికైనా కుక్కలో, పిల్లులో కరిస్తే గాయాన్ని సబ్బుతో శుభ్రంగా కడిగి 28 దినాలలో షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయించుకోవాలని సూచించారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే మరణించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. 2030 నాటికి రేబిస్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. తర్వాత సుమారు 44 కుక్కలకి, పిల్లులకు ఆయన రేబిస్ నివారణ టీకాలు వేశారు.

**కళ్యాణదుర్గంరూరల్ :** కళ్యాణదుర్గం పట్టణంతో పాటు ముదినాయనిపల్లి, గోళ్ల పశు వైద్యశాలల్లో పశు వైద్య సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాస్ గుప్తా 74 వీధి కుక్కలకు, కుక్కపిల్లలకు రేబిస్ నివారణ టీకాలు వేశారు. కుక్క కరచినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. పశువైద్యుడు రమేష్, పశుగణ సహాయకులు రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబును విమర్శించే స్థాయి రంగయ్యకు లేదు

**కళ్యాణదుర్గం, సెప్టెం బరు 28 :** సీఎం చంద్రబాబును విమర్శించే స్థాయి మాజీ ఎంపీ తలారి రంగయ్యకు, వైసీపీ నాయకుడు ఉమామహేశ్వరనాయుడుకు లేదని కూటమి నాయకులు మండిపడ్డారు. పట్టణంలోని ప్రజావేదిక వద్ద శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ హయాంలో తిరుపతి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యిని వాడారన్నది వాస్తవమన్నారు. దానిని కప్పిపుచ్చుకోవడానికి వైసీపీ శ్రేణులు చంద్రబాబుపై విమర్శలు చేస్తున్నారన్నారు. కేవలం వంద రోజుల పాలనలోనే సీఎం చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల మన్ననలు పొందారన్నారు. 74 యేళ్ల వయసులో కూడా అలుపెరుగని పోరాటం చేస్తున్న ఆయన్ను చూసి వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు. అనంతరం వైసీపీ శ్రేణులు స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి రావడంతో.. ఆలయం అపవిత్రం అయిందని కూటమి నాయకులు, మహిళలు కలిసి నీటితో ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు.

## దిగుజారుడు రాజకీయాలు మానుకోవాలి

**గుంతకల్లు, సెప్టెంబరు 28:** వైసీపీ నాయకులు దిగజారుడు రాజకీయాలను మానాలని టీడీపీ పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీఎస్ కృష్ణారెడ్డి సూచించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. తిరుపతి లడ్డూలో నెయ్యి కల్తీ జరగలేదని, అధికారం ఉంటే గాడిదలు మాట్లాడినా చెల్లుతుందంటూ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతి రెడ్డి చేసిన వ్యాఖ్యలు అనుచితమన్నారు. మూడు నెలల కిందటి వరకూ ఆమె తండ్రి వెంకట రామిరెడ్డి కూడా అధికారంలో ఉన్నారనేది గుర్తించాలన్నారు. నైరుతి రెడ్డి, ఆమె భర్త కారణంగానే వెంకటరామిరెడ్డి ఓడిపోయారని పేర్కొన్నారు. ఇకపై మాట్లాడేటప్పుడు పద్ధతిగా మాట్లాడి గౌరవాన్ని దక్కించుకోవాలని హితవు పలికారు. సమావేశంలో నాయకులు ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, అంజి, ఫజులు, హనుమంతు, పెంచలపాడు వెంకటేశులు, రాయల్ వెంకటేశులు పాల్గొన్నారు.